# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

మంగళవారం 14 మే 2024

సంపుటి.01 సంచిక.300


## మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొన్న బస్సు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

**జనగామ:** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రఘునాథపల్లిలో నేషనల్ హైవేపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను అతివేగంతో వచ్చిన ఆర్టీసీ గరుడ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడే టిఫిన్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులు స్పాట్‌లోనే మృతి చెందారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# తెలంగాణలో పోలింగ్

# 64.93%

రాష్ట్రంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. మొత్తం 64.93 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు చూపిన ఉత్సాహంతో 2019 లోక్‌సభ ఎన్నికలను మించి ఓట్లు పోలయ్యాయి.

**అత్యధికంగా భువనగిరిలో 76.47%**

**అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.08%**

**చెదురుమదురు ఘటనలు మినహా లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతం**

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 50.34 శాతం**

**తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్..!**

**ఏపీలో రబ్బర్ బుల్లెట్లు, రాళ్ల దాడులు**

**మస్యాత్మక ప్రాంతాల్లో ఐదు గంటలకు ముగిసిన పోలింగ్**



## ఓటేశాం.. వెళ్లొస్తాం!..

### తెలంగాణ బాటపట్టిన ప్రజలు

అమరావతి: సొంత ఊరిలో ఓట్లేసిన ప్రజలు సాయంత్రానికి తిరిగి తెలంగాణ బాటపట్టారు. కార్లు, బస్సులు.. ఏ వాహనం దొరికితే అది పట్టుకొని హైదరాబాద్‌కు బయల్దేరారు. హైదరాబాద్ వైపు వచ్చే రహదారుల్లో సోమవారం సాయంత్రం 5 గంటల దాటాక ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు టోల్‌గేట్ వద్ద సాధారణంగా 24 గంటల వ్యవధిలో 20 వేలకు పైగా వాహనాలు హైదరాబాద్ వైపు వెళుతుంటాయి. సోమవారం మాత్రం సాయంత్రం 6.30 గంటలకు వీటి సంఖ్య 35 వేలకు పైగా చేరింది. రద్దీ అంతకంతకు పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుమారు 6 లక్షల మంది తెలంగాణ నుంచి వచ్చినట్లు అంచనా.

### తెలంగాణలో కొత్త శక్తిగా భాజపా.. రెండంకెల

# లోక్‌సభ స్థానాల్లో గెలుస్తాం

**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా రెండంకెల స్థానాలు సాధించడం ఖాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన పోలింగ్‌తో తమ పార్టీ తెలంగాణలో కొత్త శక్తిగా నిలుస్తుందని అన్నారు. అన్ని లోక్‌సభ స్థానాల్లో తమకు జనం నుంచి సానుకూల స్పందన లభించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మోదీకి అండగా నిలిచారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గినా తమ పార్టీకి అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర పార్టీలకు ఓటు వేసిన వారంతా ఈసారి భాజపాకు మద్దతుగా నిలిచారన్నారు. ఓటింగ్ శాతంతో సంబంధం లేకుండా సికింద్రాబాద్‌లో భాజపా విజయం సాధిస్తుందన్నారు. పోలింగ్ అనంతరం సోమవారం రాత్రి భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ కుటిల యత్నాలను ప్రజలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ఆ పార్టీకోసం మజ్లిస్ కార్యకర్తలు పనిచేశారని ఆరోపించారు. భాజపా అభ్యర్థులపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోలేదన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాహుల్‌గాంధీ నేతృత్వం వహించినన్ని రోజులు భాజపాకు ఢోకా లేదన్నారు. ఎలాగూ ప్రధాని కాలేకపోతున్నారని పెళ్లి చేసుకుందామని ఆయన నిర్ణయించుకున్నట్లుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో పనిచేసిన భాజపా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. చాలామంది ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు వెళ్లడం తదితర కారణాలతో ఓటింగ్ శాతం తగ్గిందని తెలుస్తోందన్నారు.



**లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా రెండంకెల స్థానాలు సాధించడం ఖాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.**


**సికింద్రాబాద్‌లో విజయం ఖాయమని ధీమా**

**ఈ ఏడాదే గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు**

తెలంగాణ విమోచన దినోత్సవాలను ఏటా అధికారికంగా నిర్వహించేందుకు కూడా కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం, పసుపుబోర్డు, టెక్స్‌టైల్ పార్కు ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి నోచుకోనున్నట్లు తెలిపారు.

## ప్రశాంతంగా తెలంగాణ పోలింగ్

**హైదరాబాద్:** తెలంగాణలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఎన్నికల అధికారి(సీఈవో) వికాస్ రాజ్ వెల్లడించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తలేదన్నారు. మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా వచ్చారని పేర్కొన్నారు. ఇంకా 13, 14 వందల పోలింగ్ స్టేషన్లో ఇంకా పోలింగ్ నడుస్తోందని తెలిపారు. ఉదయం నుంచి పోలింగ్ మంచిగా జరిగిందన్నారు. తెలంగాణలో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైందని.. అత్యధికంగా మెదక్‌లో 71.33 శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.17 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. కేంద్ర ఆధ్వర్యంలో ఉండే యాప్‌లలో 415 ఫిర్యాదులు రాగా.. వేర్వేరు ప్రాంతాల్లో 38 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. 225 ఫిర్యాదులు సీ విజిల్ యాప్ ద్వారా వచ్చాయన్నారు. భారీ బందోబస్తుతో స్ట్రాంగ్‌రూమ్స్‌లో ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఈవీఎంలలో సమస్య వస్తే వెంటనే రీప్లేస్ చేశామని.. సాయంత్రం ఐదు గంటలకు వచ్చిన పోలింగ్ శాతం అంచనానే అంటూ సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత కచ్చితమైన పోలింగ్ శాతం వస్తుందని.. మంగళవారమే పూర్తి పోలింగ్ శాతం వస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 330 కోట్లు సీజ్ చేశామన్నారు. 44 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని.. జనరల్ అబ్జర్వర్స్ ఇచ్చే నివేదిక మేరకు ఎక్కడైనా రీపోలింగ్ అవసరమా లేదా నిర్ణయిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా పోలింగ్ కేంద్రాల్లో ప్రజల స్వచ్ఛందంగా ఓటు వేయడానికి వచ్చారన్నారు. ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో క్యూలైన్లో ఓటర్లు ఉన్నారన్నారు. ఆదివారం మధ్యాహ్నం వర్షం కారణంగా పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరడానికి కొంత ఆలస్యమైందని తెలిపారు. వర్షం కురిసినప్పటికీ ఎక్కడా ఇబ్బంది లేకుండా పోలింగ్ సిబ్బంది సరైన సమయానికి పోలింగ్ను స్టార్ట్ చేశారన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఎక్కడైనా సమస్య ఉంటే 1950కి ఫిర్యాదు చేయాలన్నారు. 70 శాతం పోలింగ్ నమోదవుతుందని ఆశిస్తున్నట్లు సీఈవో వికాస్ రాజ్ పేర్కొన్నారు. కొన్ని చోట్ల వర్షాల వల్ల నిర్మల్,ఆదిలాబాద్,ఆసిఫాబాద్‌లో ఇబ్బందులు వచ్చాయన్నారు. 1-2 శాతం ఈవీఎంలు ఆలస్యంగా వెళ్లాయన్నారు. పరిస్థితి అంతా అదుపులోనే ఉందని తెలిపారు. తెల్లవారుజామున 5:30 గంటలకే మాక్ పోలింగ్ జరిగిందని.. 7 గంటలకు పోలింగ్ స్టార్ట్ అయిందని తెలిపారు. లా అండ్ ఆర్డర్ బాగుందన్నారు.



**భద్రత మధ్య ఇవిఎంల తరలింపు**

**పూర్తిస్థాయి ఓటింగ్ శాతం నేడు ప్రకటన**

**సిఇవో వికాస్ రాజ్ వెల్లడి**

# తెలంగాణలో పోలింగ్ 64.93%



హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. మొత్తం 64.93 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు చూపిన ఉత్సాహంతో 2019 లోక్‌సభ ఎన్నికలను మించి ఓట్లు పోలయ్యాయి. మంగళవారానికి తుది గణాంకాలు వెల్లడైతే ఈ పోలింగ్ శాతం మరింత పెరగనుంది. అక్కడక్కడా స్వల్ప సంఘటనలు మినహా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కొంత తక్కువగా నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో 71.34 శాతం ఓటింగ్ జరిగింది. సాధారణ ఎన్నికల నాలుగో విడతలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కూడా పూర్తయింది. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఆదిలాబాద్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. మిగిలిన 106 సెగ్మెంట్లలో 6 గంటల వరకు కొనసాగింది. సమయం ముగిసే సమయానికి వరుసలో నిలబడిన వారందరికీ అధికారులు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. గిరిజన గూడేలు, తండాల్లో కూడా పోలింగ్ బాగా జరిగిందని అధికారులు చెబుతున్నారు. అర్ధరాత్రి సమయానికి అందిన సమాచారం ప్రకారం 64.93 శాతం నమోదైంది. అత్యధికంగా భువనగిరిలో 76.47 శాతంగా అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.08గా ఉంది. పది నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. 2019లో కేవలం ఐదు నియోజకవర్గాల్లోనే 70 శాతం పోలింగ్ దాటడం గమనార్హం. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో 50.34 శాతం పోలింగ్ నమోదైంది.

**రాష్ట్రంలో కొన్నిచోట్ల..**

హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద భాజపా అభ్యర్థి మాధవీలత ఓ ఓటరు నకాబ్‌ను తీయించి చూడటంపై వచ్చిన ఫిర్యాదుతో ఆమెపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒక్క హైదరాబాద్ నగరంలో కొన్ని చోట్ల చెదురుమదురు సంఘటనలు జరిగాయి. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కోరుట్ల పరిధిలోని వేములకుర్తి పోలింగ్ కేంద్రంలో ఓ యువకుడు సెల్ఫీ తీసుకోవటాన్ని వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వటంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. జగిత్యాల మండలంలోని చిన్న కాలువాయి గ్రామంలో 110 మంది ఓటర్లు ఉండగా నూరు శాతం ఓటింగ్ నమోదైంది.మహబూబాబాద్ జిల్లా బయ్యారం వెంకట్రాంపురం 26వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంపై కాంగ్రెస్ గుర్తు దగ్గర గుర్తుతెలియని వ్యక్తులు ఇంకు పెట్టారు. భారాస ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో పోలింగ్ నిలిపివేసి మరో ఈవీఎంను ఏర్పాటు చేసి కొనసాగించారు.

జనగామ జిల్లా ధర్మకంచ బాలికల ఉన్నత పాఠశాలలో 263 పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు యువజన కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి రాగా.. భారాస నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదే సమయానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకోవడంతో వేడి మరింత పెరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూరుస్టేషన్‌లోని 211 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి ఓ యువకుడు ఫొటో తీసి వాట్సప్ స్టేటస్ పెట్టుకున్నారు. అది వైరల్ కావడంతో ఆ యువకుడిపై చర్యలు తీసుకోవాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పోలింగ్ సిబ్బంది పేర్కొన్నారు.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వేములతండాలో బానోత్ బాల కిషన్ అనే యువకుడు ఓటు వేసి వీవీప్యాట్‌లో కనిపించే పార్టీ గుర్తును ఫొటో తీసి వాట్సప్ స్టేటస్ పెట్టుకున్నారు. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. ఇదే విషయమై భారాస, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి విచారణ చేపట్టారు.

వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి రహమత్‌నగర్‌లోని 164 పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్‌ను ఓటరు ఒకరు గట్టిగా నొక్కడంతో అది పనిచేయకుండా పోయింది. రెండు గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది.

**ఉదయం నుంచే పోలింగ్...**

ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటర్లు పెద్ద సంఖ్యలో క్యూలలో వేచి ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు 9.48 శాతం పోలింగ్ నమోదు అయింది. 11 గంటలకు 24.35, మధ్యాహ్నం ఒంటిగంటకు 40.38, మూడు గంటలకు 52.34 శాతానికి చేరుకొని తరువాత నెమ్మదించింది. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్.ఆర్.నగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సినీ ప్రముఖులు ఎక్కువ మంది నగరంలోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్, జూబ్లీహిల్స్ క్లబ్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, ఓబుల్‌రెడ్డి స్కూల్స్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**రాజధానిలో అంతంతే...**

రాజధానిలో సికింద్రాబాద్, హైదరాబాద్ నియోజకవర్గాల్లో 50 శాతం కూడా పోలింగ్ నమోదు కాలేదు. మల్కాజిగిరి, చేవెళ్లలలో 50 శాతం దాటింది. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్ శాతాలతో పోల్చి చూస్తే ఇక్కడ భారీగా నమోదు కానట్లే. సోమవారం ఉదయం నుంచి మహానగరంలో వందల పోలింగ్ బూత్‌లు ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఉదయం 7కే పోలింగ్ మొదలైనా చాలా కాలనీల్లో 9 వరకు ఓటర్లు బూత్‌ల వైపు కన్నెత్తి చూడలేదు. కొన్నిచోట్ల ఉదయం వాకింగ్‌కు వెళ్లినవారు అటుగా వెళ్లి ఓటేసి ఇళ్లకు వెళ్లిపోయారు. హైదరాబాద్ నియోజకవర్గంలో మధ్యాహ్నం 2 గంటల వరకు 20 శాతమే పోలింగ్ నమోదైంది. చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర సెగ్మెంట్లలో కొందరు యువకులు, పార్టీల కార్యకర్తలు.. ఓటర్ల ఇళ్లకు వెళ్లి తలుపులు తట్టి మరీ ఓటేసేందుకు రావాలని కోరారు.

**మొరాయించిన ఈవీఎంలు**

రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. కనెక్షన్లు సరిగా ఇవ్వకపోవడం తదితర సమస్యలతో కొన్నిచోట్ల
పోలింగ్ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ఇదే ఇబ్బందితో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఓటేయడానికి కొంత సేపు నిరీక్షించాల్సి వచ్చింది. తమ ప్రాంతాల సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా పలు గ్రామాల ప్రజలు ఓటింగ్‌ను బహిష్కరించగా అధికారులు నచ్చజెప్పటంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

## తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్..!

**ఏపీలో రబ్బర్ బుల్లెట్లు, రాళ్ల దాడులు**
**మస్యాత్మక ప్రాంతాల్లో ఐదు గంటలకు ముగిసిన పోలింగ్**

తెలుగు రాష్ట్రాల్లో నాలుగవ విడత పార్లమెంటు పోలింగ్ ముగిసింది. తెలంగాణలో పార్లమెంట్ పోలింగ్ ముగియగా ఆంధ్రప్రదేశ్ లో పార్లమెంట్ తో పాటు శాసనసభ ఎన్నికల పోలింగ్ కూడా ముగిసింది. తెలంగాణలో ఒకటి, రెండు చిన్న వివాదాలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఏపీలో మాత్రం అనేకచోట్ల పెద్ద ఎత్తున వివాదాలు చోటు చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పై టిడిపి వర్గీయులు రాళ్ల దాడి చేయడంతో టిడిపి కార్యకర్తలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ క్రమంలో రబ్బర్ బుల్లెట్లను పోలీసులు ప్రయోగించారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం బెట్టి పాలెం పోలింగ్ కేంద్రంలో వివాదం జరిగి టిడిపి కార్యకర్తలు ఈవీఎంలను ధ్వంసం చేశారు. దాంతో బెట్టి పాలెంలో ఐదు గంటలకే పోలింగ్ నిలిచిపోయింది. బాపట్లలో గవినివారి పాలెం లో టిడిపి వైసిపి కార్యకర్తలు నడుమ ఘర్షణ జరిగింది. టిడిపి అభ్యర్థి కొండయ్య వాహనంపై రాళ్లదాడి చేశారు. దాంతో కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఇక్కడ టిడిపి కార్యకర్తలు వైసిపి కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్ల దాడి చేసుకున్నారు. తెలంగాణలోని హైదరాబాదులో గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ పై కేసు నమోదు అయింది. అధికారితో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందడంతో మంగళ్ హాట్ పిఎస్ లో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.

**6 గంటలకు ముగిసిన పోలింగ్ :**

తెలుగు రాష్ట్రాలలో ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తెలంగాణలో సాయంత్రం 6 గంటల వరకు 61.16% పోలింగ్ నమోదయింది.

జహీరాబాద్ 63. 96 అత్యధికంగా పోలింగ్ కాగా హైదరాబాదులో 29.47% అత్యల్పంగా పోలింగ్ నమోదయింది. ఆంధ్రప్రదేశ్ లో సాయంత్రం 6 గంటలకు 75% పోలింగ్ నమోదు కాగా చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 74% అల్లూరి జిల్లాలో అత్యల్పంగా 55 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ బూత్ లోకి వచ్చిన వారందరికీ ఓటు హక్కు కల్పించడం వల్ల మరికొంత పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

# ఎన్నికల సంస్కరణలు తక్షణావశ్యకం !

దేశవ్యాప్తంగా నాలుగోవిడత ఎన్నికలు ఉత్సాహంగా సాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలతో పాటు, ఎపిలో అసెంబ్లీ ఎన్నికలకు ఓటేసేందుకు ప్రజలు బారులు తీరారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఓటేసేందుకు సొంతూళ్లకు వెళ్లడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. అయినా ఓటర్లు ఇంకా ఇల్లు విడిచి బయటకు రావాడానికి వెనకాడడం సహించరాని నేరంగా పరిగణించాలి. ఓటర్లు అంతా నూటికినూరు శాతం కాకున్నా కనీసం 90శాతం మంది ఓటేస్తేనే ప్రజల పూర్తి అభిప్రాయం తెలుస్తుంది. ఇందుకోసం కఠిన చట్టాలను తీసుకుని రావాలి. ఓటేయడం ఖచ్చితం చేయాల్సిన ఆగత్యం వరుస ఎన్నికల్లో ఓటింగ్ శాతాలను బట్టి తెలుస్తోంది. ఇప్పటికే మూడుదశల్లో ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికల్లో కూడా 70శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. నాలుగో విడత కూడా మందకొడిగానే పూర్తి కావచ్చింది. ప్రజలు ఎవరికి అధికారం కట్టబెట్టాలో తీర్పునిచ్చారు. మరో మూడు విడుతల్లో జూన్ 1 వరకు ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెల్లడితో ఎవరు అధికారంలోకి రాబోతున్నారో తేలనుంది. ఈ మూడు విడతల్లో అయినా మరింత ఉత్సాహంగా ఓటేసేలా ప్రజలు ముందుకు రావాలి. ఇకపోతే ఎన్నికల చట్టంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఇన్నేళ్లుగా వస్తున్న ఓట్ల పండగలను బట్టి గమనించవచ్చు. ప్రధానంగా పటిష్టమైన ఓటురాకార్డు..పర్మినెంట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలి. మనిషి మరణించేవారకు ఓటును ఆధార్, పాన్‌లాగా దాచుకునేలా పటిష్టం చేయాలి. అలాగే ఓటు వేయడం అన్నది విధిగా చేయాలి. ఇంట్లో కూర్చుని ఓటేయకపోవడాన్ని నేరంగా పరిగణించాలి. ఈ రెండూ చేస్తే కొంత మార్పు రావచ్చు. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రలోభాలను అరికట్టాలి. డబ్బుల పంపిణీ, గిఫ్టుల పంపిణీ చేస్తే పార్టీల గుర్తు రద్దు చేసేలా చేయాలి. అట్టహాసంగా సభలు పెట్టే దానిని కూడా నియంత్రించాలి. సోషల్ మీడియా, టివి రంగం అందుబాటులోకి వచ్చింది కనుక ప్రచారం పరిమితం చేయాలి. జనాలను అదేపనిగా లక్షల సంఖ్యలో తరలించి భారీ బహిరంగ సభలను నిర్వహించే పద్దతిని నిర్మూలించగలగాలి. ఎన్నికలను రాజకీయ పార్టీలు ఖరీదైనవిగా చేస్తూ పోతున్నాయి. సామాన్యులు పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్థులు, గుండాలు, డబ్బున్న వారు మాత్రమే పోటీ చేయగలుగుతున్నారు. ఇకపోతే జనాభా నియంత్రణ కూడా ఇందులో జోడించాలి. అత్యధిక మందిని కంటున్న వారిపై ఆంక్షలు పెట్టాలి. అలాంటివారు పోటీచేయకుండా, ఓటేయకుండా చేయాలి. ఎన్నికల సంస్కరణలపై కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం చర్చించాలి. పటిష్టమైన ఎన్నికల విధానం రావాలి. అలా వచ్చిన తరవాత ఎన్నికైన వారు ప్రజాస్వామ్య బద్దంగా నడుచుకునేలా మన వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఈ క్రమంలో ఇప్పటికైనా పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు అవకాశం రావాలి. ప్రధానంగా కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నా ప్రజాస్వామ్యం దెబ్బతినరాదు. ప్రజల తీర్పును అపహాస్యం చేయరాదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాపాడడంతో పాటు సంబంధాలను బలపర్చాలి. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడి, గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం పెత్తనం చెలాయించేలా చేస్తున్న ప్రయత్నాల ను అడ్డుకునేలా చట్టాలు రావాలి. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ అంశాలపై చర్చ చేయాలి. ప్రాంతీయపార్టీలు ఇవే అంశాలపై ఆందోళన చెందుతున్నాయి. దీనిపై ఉమ్మడిగా పోరాడాలన్న ప్రయత్నాలు వ్యక్తం అవుతున్నా సంఘటితం కాలేకపోతున్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సిఎంలు ఏకాభి ప్రాయానికి రావాల్సి ఉంది. నిజానికి గవర్నర్ వ్యవస్థను కాంగ్రెస్ బాగా భ్రష్టు పట్టించింది. దీనిని రద్దు చేయాలన్న అభిప్రాయం ఉంది. రాజకీయపార్టీలు ముందుగా ఈ విషయంలో చర్చచేయాల్సి ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. పంచాయత్‌రాజ్ చట్టం ఆమోదించిన తర్వాత, స్థానిక స్వపరిపాలన సంస్థలకు హక్కులు ఇవ్వబడ్డాయి. వాటికి అధికారాలు కేటాయించబడ్డాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశంలోని గ్రామాలు, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరు సరికాదు. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. కేంద్రం తరచూ రాజ్యాంగం నిర్వచించిన అధికార పరిధిని ఉల్లంఘిస్తోంది. కేంద్ర తన పరిధిని విస్తరించే క్రమంలో రాష్ట్రాల అధికారాలను ఆక్రమించాలని చూస్తోంది. ఇది కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది. ఇప్పుడు మోడీ హయాంలో నిత్యం జరుగుతోంది. నిజానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలహీనపడ్డాయి. అందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వమే కారణమని చెప్పుకోవాలి. రాజ్యకాంక్ష విస్తరణతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. జాతీయ విధానాలను తుంగలో తొక్కారు. రాష్ట్రాలన్ని కలిస్తేనే దేశం అవుతుంది. అలాంటి రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి దానికీ బిచ్చం ఎత్తుకునేలా పరిస్థితి తీసుకుని వచ్చారు. అలాగే రాష్ట్రాలు, స్థానిక సంస్థలను లొంగదీసుకునే ఉద్దేశ్యంతో వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకి రావాల్సిన నిధులు సక్రమంగా విడుదల కావాలి. ఏ పనులకు కేటాయించిన నిధులు అవి పూర్తి చేసేలా చూడాలి. రానున్న కొత్త ప్రభుత్వం రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ వేదికగా అన్ని అంశాలు చర్చించాలి. రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించుకుంటున్న తీరు గత పదేళ్లుగా చూస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో రాజ్‌భవన్ ద్వారా సమాంతర ప్రభుత్వాన్ని నడపాలని చూసారు. ఇలా ప్రతి అంశాన్ని చర్చించి అందుకు అనుగుణంగా మన ఎన్నికల సంఘాన్ని ,రాజ్యాంగాన్ని బలోపేతం చేసి భారత ప్రజాస్వామ్యాన్ని ఆదర్శంగా నిలపాలి.

## ముంబైలో ఈదురుగాలుల బీభత్సం
## హోర్డింగ్ కూలి ముగ్గురు దుర్మరణం

**ముంబై:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు పెను బీభత్సం సృష్టించాయి. తేలికపాటి వర్షంతో పాటు బలమైన గాలులు వీచడంతో ఘట్కోపార్ ప్రాంతంలో భారీ హోర్డింగ్ పేకమూడలా కుప్పకూలి నలుగురు దుర్మరణం పాలయ్యారు. సుమారు 57 మంది గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. హోర్డింగ్ కింద సుమారు 100 మంది చిక్కుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. ఘట్కోపార్ ప్రాంతంలో భారీ బిల్‌బోర్డ్ కుప్పకూలి పెనువిపత్తు సంభవించిన ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్టు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. 'బిల్‌బోర్డ్ కింద చిక్కుకున్న 47 మందిని ఇంతవరకూ సురక్షితంగా బయటకు తెచ్చాం. యుద్ధప్రాతిపదికన ముంబై పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజిమెంట్ సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం' అని ఫడ్నవిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.బ్రృహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషణ్ గగ్రాని ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియజేస్తూ, ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌ను కూడా రంగంలోకి దింపామని, గ్యాస్ కట్టర్లను కూడా ఘటనా స్థలికి పంపామని చెప్పారు. హోర్డింగ్ కుప్పకూలిన ఘటనపై రైల్వే అండ్ అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ ఎగో మీడియాపై డిజాస్టర్ మేనేజిమెంట్ యాక్ట్ కింద బీఎంసీ ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కాగా, క్షతగాత్రులను తక్షణ చికిత్స కోసం రాజావాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పన్నుల భారంతో ఆర్థికమాంద్యం

**న్యూఢిల్లీ:** యుద్దాలు, అంతర్జాతీయ పరిణమాల కారణంగా చమురు, సహజవాయువుల ధరలు విపరీతంగగా పెంచుతూ పోవడం వల్ల దేశంలో తయారీరంగం కుదేలయ్యింది. అలాగే ధరల పెరుగుదలకు కారణమయ్యింది. ఈ ధరలపై పన్నుల వసూళ్లు కూడా పెంచడంతో మరింతగా ఆర్థిక రంగం కుదేవలుతూ వస్తోంది. దీనికి పరిస్కారం కనుగొనకుండా ఆదాయ మార్గం పెరిగిందన్న ధోరణిలో కేంద్రం ఉంది. ఈ చర్యల కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. కొనుగోలు శక్తి తగ్గుతోంది. వస్తూత్పత్తి పెరుగుతున్నా మార్కెట్ లేకుండా పోతోంది. దీంతో వస్తువుల ధరలు పెరిగి సామాన్యులకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. అందువల్ల మన పన్నుల విధానాన్ని తక్షణం సమీక్షించాల్సిఉంది. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి తగ్గట్లుగా విధానాలు ఉండాలి. నిజానికి యుద్దాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. తరవాత ఇజ్రాయిల్ యుద్ధం కూడా ఇదే పరిస్థితిలోకి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల కారణంగా ధరల దాడి తప్పడం లేదు. ప్రధానంగా ఆయిల్, నూనెల ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్రో,గ్యాస్ ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు లేవని చెప్పలేం. మంచినూనెల సరఫరా కూడా దెబ్బ తినే అవకాశం ఉన్నందున ఇప్పటికే పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా నూనె, వనస్పతి ధరలు కూడా పెరగడం మొదలెట్టాయి. మనదేశ చమురు ఉత్పత్తుల వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడి జరుగుతుంది. కరోనా వలన, ఇతర కారణాల వలన చమురు ఉత్పత్తుల వినియోగం తగ్గింది. కాని పెరిగిన ధరల వలన వాటికి వెచ్చించే మొత్తం మాత్రం పెరిగింది. ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించలేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించి వేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు.పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగు తోంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరు తోంది.

# వందరోజుల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం

## ఇండియా కూటమి విజయం సాధిస్తోంది

## 75 ఏళ్ల మోడీకి పదవి ఎలా ఇస్తారు

## మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కొడంగల్:వేగుచుక్క న్యూస్:** సెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 33.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఈ ఎన్నికల్లో అంతకు మించివస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండమని తెలిపారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్‌లో కుటుంబసమేతంగా సీఎం రేవంత్ ఓటేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెప్టెంబర్ 17, 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయని.. ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలని హితవుపలికారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరని సీఎం వెల్లడించారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తోందని.. 400 సీట్లు ఎట్లా సాధ్యమని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా, 10 ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ.. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదని విమర్శించారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవన్నారు. సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడంలేదని నిలదీశారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి పేరుతో తాము ప్రజలను ఓట్లు అడుగుతోంటే... మోదీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు.

## ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన రేవంత్ రెడ్డి

### అతనిపై చర్యలకు ఇసికి రఘునందన్ ఫిర్యాదు

**దుబ్బాక:** సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. ఓటేసేందుకు వెళ్లి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయాల గురించి మాట్లాడారని ఆయన విమర్శించారు. దేశ ప్రధాని, బీజేపీ పార్టీ గురించి ఎలా మాట్లాడుతారని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశామన్నారు. ఆయనను సాయంత్రం వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని, ఆయన్ని మాట్లాడనియకుండా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు. ఎన్నికలు ముగిసి ఫలితాల తర్వాత సీఎం మాట్లాడితే బాగుంటుందన్నారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆ భయంతోనే తన స్థానానికి ఎక్కడ ఇబ్బంది వస్తోందోనన్న అనుమానంతో ఓటర్లను ప్రలోభపెట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# చెదురుముదురు ఘటనల మధ్య ముగిసిన పోలింగ్

## ఎపిలో భారీగా తరలి వచ్చి ఓటేసిన ప్రజలు

## పోలింగ్ శాతంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం

## 75శాతం వరకు నమోదైనట్లు అంచనా

**హైదరాబాద్/అమరావతి,వేగుచుక్క న్యూస్:** హింసాత్మక ఘటనల మధ్య తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. 6గంటల సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఉత్సాహంగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో గతంలో కంటే పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటంతో రాత్రి 10 గంటల వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. పోలింగ్ సమయం ముగిసే సరికి దాదాపు75 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. తుది పోలింగ్ శాతంపై మంగళవారం ఉదయానికి పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. పల్నాడు, అనంతపురం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఎక్కువగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. తాడిపత్రిలో జిల్లా ఎస్పీపైనే వైకాపా శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. గుంటూరు జిల్లా తెనాలిలో వైకాపా ఎమ్మెల్యే ఓటరుపై దాడి చేయడం కలకలం రేపింది. వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలం కారుమంచిలోని పోలింగ్ బూత్ 136లో 200 ఓట్లు మిగిలి ఉండగానే.. అధికారులు పోలింగ్ నిలిపివేశారు. వీవీ ప్యాట్లు అయిపోయాయని, ఛార్జింగ్ లేదని అధికారులు చెప్పారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు ఘటనల మినహా ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టు ప్రభావితప్రాంతాలైన ఐదు ఎంపీ నియోజకవర్గాల పరిధిలోని 13అసెంబ్లీ సెగ్మెంట్లు సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వరావుపేటలో సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసింది. జగిత్యాల జిల్లాలో ఓటేస్తూ ఫొటో తీసుకున్న జయరాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

**ప్రశాంతంగా తెలంగాణలో పోలింగ్**

**మధ్యాహ్నం వరకు 40.13 శాతం నమోదు**

**కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్ రెడ్డి**

**రామ్‌నగర్‌లో గవర్నర్ దత్తాత్రేయ దంపతుల ఓటు**

**చింతమడకలో ఓటేసిన కెసిఆర్ దంపతులు**

**ఓటేసిన మంత్రులు, ఎమెమెల్యేలు, అభ్యర్థులు, సినీ ప్రముఖులు**

# ప్రశాంతంగా పోలింగ్

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 13**

లోక్ సభ ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. 7 శాసనసభా నియోజకవర్గాల పరిధిలో 1808 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ జరిపిన అనంతరం అన్ని చోట్ల ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పోలింగ్ ప్రారంభ సమయానికే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ లలో నిలబడి తమ చైతన్యాన్ని చాటుకున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచాలనే కృతనిశ్చయంతో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ఓటరు అవగాహన కార్యక్రమాలతో పాటు, ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయడం, పట్టణ ప్రాంతాలలో గత ఎన్నికలలో పోలింగ్ తక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఆదర్శ పోలింగ్ స్టేషన్లను, మహిళలు, దివ్యంగులు, యువత కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఓటర్ల దృష్టిని ఆకర్షించింది. ఫలితంగా 2019 పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత ఎన్నికల్లో నిజామాబాదు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో గణనీయంగా ఓటింగ్ శాతం పెరిగింది. పోలింగ్ సమయాన్ని ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు సమయాన్ని పెంచడం కూడా ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడింది. 2019 ఎన్నికల్లో సగటున 68.37 శాతం ఓటింగ్ జరుగగా, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ ముగియడానికి మరో గంట వ్యవధి మిగిలి ఉండగానే సాయంత్రం ఐదు గంటల సమయానికే 67.96 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ, పలు పోలింగ్ స్టేషన్ల వద్దకు చేరుకున్న ఓటర్లకు ఓటింగ్ అవకాశం కల్పించారు.

మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల్లో మొదటి రెండు గంటలకే సగటున 10.91 శాతం ఓటింగ్ నమోదయ్యింది. అనంతరం కూడా అంతకంతకూ ఊపందుకుంది. ఉదయం 11 గంటల సమయానికి 28.26 శాతం జరిగిన ఓటింగ్, మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 45.67 శాతానికి, మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి 58.70 శాతానికి, సాయంత్రం 5.00 గంటల సమయానికి 67.96 శాతానికి చేరుకుంది.

పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఉదయం నుండే పోలింగ్ కేంద్రాలకు తరలివస్తూ ఓటు వేసిన జిల్లాలోని ఓటర్లందరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. నియోజకవర్గాల వారీగా మహిళలు, యువత, దివ్యంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్లు ప్రజలను ఆకర్షిస్తూ, ఓటింగ్ ప్రాధాన్యత గురించి అందరినీ ఆలోచింపజేసాయని కలెక్టర్ అన్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన నియోజకవర్గాలపై, ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ స్వీప్ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సాయుధ బలగాలను మోహరించడం జరిగిందన్నారు.

కాగా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉదయం వేళలోనే జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ బాలుర ఐ.టి.ఐ లోని 216 నెంబరు పోలింగ్ బూత్ వద్దకు చేరుకొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఉదయం నుండి మొదలుకుని ఓటింగ్ ముగిసేంత వరకు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా పోలింగ్ స్టేషన్లలో కొనసాగిన పోలింగ్ తీరుతెన్నులను, ఓటింగ్ సరళిని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ తో కలిసి పర్యవేక్షించారు. ఆయా పోలింగ్ బూత్ లలో నెలకొని ఉన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ మానిటర్ లలో ప్రత్యక్షంగా వీక్షిస్తూ, ఎక్కడైనా చిన్నచిన్న లోటుపాట్లను గమనించిన వెంటనే సంబంధిత అధికారులను, సెక్టోరల్ ఆఫీసర్లను అప్రమత్తం చేస్తూ పరిస్థితులను చక్కదిద్దారు.






**బారులుతీరిన ఓటర్లు.**

**సత్ఫలితాలు ఇచ్చిన ఓటరు అవగాహన కార్యక్రమాలు**

**ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్.**

**అదనపు కలెక్టర్ తో కలిసి పోలింగ్ స్థితిగతుల పర్యవేక్షణ.**



# డేట్లు ఖాళీ లేవంటున్న రష్మిక



కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీకౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా..డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

# డాక్టర్‌ను..యాక్టర్‌ను కావాలనుకున్నవే

సినీ తారల్లో ఇదివరకు చాలామంది డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యానని చెప్పేవాళ్లు. నవతరం కథానాయిక శ్రీలీల మాత్రం డాక్టర్, యాక్టర్ ఈ రెండు వృత్తుల్నీ నాకు నేనుగానే ఎంచుకున్నా అంటోంది. మా ఇంటి వాతావరణం ప్రభావమో ఏమో... పాఠశాల రోజుల్లోనే పెద్దయ్యాక వైద్యురాల్ని కావాలని నాకు నేనుగా నిర్ణయం తీసేసుకున్నా. ఆ దిశగానే నా చదువులు సాగాయి. ఇక నటన అంటారా? నాకు చిన్నప్పట్నుంచీ నాట్యంలో ఉన్న ప్రవేశం నన్ను వేదికలెక్కించింది. ఆ ప్రతిభే నటనవైపు తీసుకొచ్చింది. ఈ రెండు వృత్తుల ప్రయాణం వేర్వేరుగా అనిపించినా... రెండు కూడా ప్రజలతో ముడిపడినవే కదా. అందుకే రెండింటిపైనా నాకు ఒకే రకమైన ప్రేమ ఉంటుందని చెప్పుకొచ్చింది శ్రీలీల. రొమాంటిక్ ప్రేమకథలన్నా, పీరియాడిక్ కథలన్నా అమితమైన ప్రేమ అని, వాటిల్లో నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోనని చెప్పింది శ్రీలీల.



# ఓటిటిలోకి వస్తోన్న 'విద్య వాసుల అహం'

ఇప్పుడు మరో సినిమా ఇదే ఓటిటి ఆహా లో విడుదలకి సిద్ధం అయింది. ఈ సినిమా పేరు 'విద్య వాసుల అహం' ఇందులో కొంచెం మసాలా కూడా వున్నట్టుగా ఈ సినిమా టీజర్ చూస్తే అర్థం అవుతోంది. అహంతో కూడిన ప్రేమకథ లోని భావోద్వేగాలను, ఇగోలను చూపించడానికి రెడీ అవుతున్నారు విద్య, వాసు. ఈ సినిమా మే 17న ప్రపంచవ్యాప్తంగా ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ వేదికగా ప్రీమియర్ కానుంది. ఈ సినిమా కథని కథని టూకీగా చెప్పాలంటే రాహుల్ విజయ్, శివానిలు అసలు పెళ్ళంటే ఇష్టం లేని వాసు, విద్యలుగా ఇందులో కనిపిస్తారు, కానీ ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోవలిసి వస్తుంది. పెళ్లయిన తరువాత ఇద్దరూ ఒకరి అభిప్రాయాలకి, ఇంకొకరు గౌరవించాలి, మాట్లాడుకోవాలి, కానీ కాని ఇద్దరూ నేనే నెగ్గాలి అని అనుకుంటే, అదే ఇగోకి పోతే, ఆ పెళ్లి జీవితంలో ప్రేమ బాధ్యతల మధ్యలో ఇగో వస్తే ఎలా ఉంటుంది అనే నేపధ్యలో కథ జరుగుతుంది. అలాంటి సమయంలో వీరిద్దరూ ఇగోతో కలిసే ఉంటారా లేదా పెళ్ళైన కొత్తలో ఉండే మూమెంట్స్ ని ఎంజాయ్ చేస్తారా అనేది తెలియాలంటే ఆహాలో మే 17 వరల్డ్ డిజిటల్ ప్రీమియర్ అయ్యే వరకు వేచి చూడాల్సిందే...ఈ సినిమాకి మహేష్ దత్త మొతూరు, లక్ష్మి నవ్య మక్కపాటి నిర్మాతలు. మణికాంత్ గెల్లి దర్శకుడు. 'విద్య వాసుల అహం' (ఏ లాంగ్ లాంగ్ ఈగో స్టోరి) అనే టాగ్ లైన్ లో వస్తున్నా ఈ సినిమా ఆహాలో ఈ నెల 17న విడుదలవుతోంది అని చిత్ర యూనిట్ వెల్లడించింది.

# రణ్‌వీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ బ్రహ్మారాక్షస

'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో పేరు సంపాదించుకున్నాడు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ఆయనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు కూడా ఆసక్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రణ్‌వీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ ఓ సినిమా చేయబోతున్నాడని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఈ ఏడాదే సెట్స్‌మీదకు వెళ్లనుందని తెలుస్తోంది.
ఈ చిత్రానికి 'బ్రహ్మరాక్షస' అనే టైటిల్‌ను ఖరారు చేశారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, అన్ని భాషల్లో అదే టైటిల్ ఉంటుందని అంటున్నారు. 'హనుమాన్' సినిమా తరహాలోనే సూపర్‌హీరో కథాంశంతో 'బ్రహ్మరాక్షస' తెరకెక్కనుందని, భారీ సాంకేతిక హంగులతో తీయబోతున్నారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ప్రస్తుతం ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్'పై దృష్టిపెట్టారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'బ్రహ్మరాక్షస' పట్టాలెక్కనుంది.



# పిరయాడిక్ డ్రామాలకు పెరుగుతున్న ఆదరణ

ఆ తరహా కథలతోముందుకు వస్తున్న హీరోలు కొత్తదనం పంచే క్రమంలో మన కథానాయకులు పిరయాడిక్ సినిమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గత కాలానికి తీసుకెళ్లి వినోదాలను అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడీ తరహా పీరియాడిక్ కథల జోరు తెలుగులో మరింత ఊపందుకుంది. పలువురు అగ్రతారలతో పాటు కుర్రహీరోలు ఈ కథలతోనే సినీ ప్రియుల్ని మురిపించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈతరం ప్రేక్షకులు ఇలాంటి సినిమాలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తుండటంతో.. వారి అభిరుచుల్ని దృష్టిలో పెట్టుకునే ఆ తరహా కథలతో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.'బాహుబలి', 'ఆదిపురుష్' చిత్రాల కోసం చరిత్ర పుటలు తిరగేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన 'కల్కి 2898ఎ.డి' కోసం తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత ఆయన చేయనున్న సినిమాల్లో హను రాఘవపూడి చిత్రం ఒకటుంది. ఇప్పుడీ చిత్రం కోసం మరోసారి గతంలోకి ప్రయాణించనున్నారు ప్రభాస్. ఇది చారిత్రక అంశాలతో నిండిన ఫిక్షనల్ పీరియాడిక్ లవ్-యాక్షన్ డ్రామాగా ఉండనున్నట్లు హను ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ దక్కించుకున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన త్వరలో బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. ఇదీ పీరియాడిక్ టచ్‌తో ఉన్న స్పోర్ట్స్ డ్రామాగానే ఉండనున్నట్లు సమాచారం. పూర్తిగా ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమా రా, రస్టిక్‌గా ఉండనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల కాలంలో నాని నుంచి వచ్చిన విజయవంతమైన చిత్రాల్లో 'దసరా' ఒకటి. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ ముందు భారీ వసూళ్లు కొల్లగొట్టింది. ఇప్పుడిదే కలయికలో మరో సినిమా రానుంది. ఇది నానికి 33వ చిత్రం. ఇదీ ఓ విభిన్నమైన పీరియాడిక్ యాక్షన్ కథాంశంతోనే ముస్తాబు కానుంది. దీంట్లో నాని ప్రజా నాయకుడి పాత్రలో కనిపించ నున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ స్పై థ్రిల్లర్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత ఆయన చేయనున్న సినిమాల్లో దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ప్రాజెక్ట్ ఒకటుంది. 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రమిది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ ఓ వీరుడిగా కనిపించనున్నారు. 'విరూపాక్ష', 'బ్రో' సినిమాలతో వరుస విజయాలందుకుని జోరు మీదున్నారు సాయిదుర్గా తేజ్. ఇప్పుడాయన రాకేశ్ అనే కొత్త దర్శకుడితో ఓ చిత్రం చేసేందుకు సమాయత్త మవుతున్నారు. ఇది 1940ల నేపథ్యంలో సాగే ఓ విభిన్నమైన కథాంశంతో రూపొందనున్నట్లు తెలిసింది. ఇక మరో మెగా హీరో వరుణ్‌తేజ్ ప్రస్తుతం చేస్తున్న 'మట్కా' కూడా పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రమే. గతేడాది 'ఏజెంట్'తో చేదు ఫలితాన్ని అందుకున్నారు యువ హీరో అఖిల్ అక్కినేని. ఇప్పుడాయన తదుపరి సినిమాని కొత్త దర్శకుడు అనిల్‌తో పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇదీ ఓ ఆసక్తికరమైన పీరియాడిక్ యాక్షన్ డ్రామాగానే ముస్తాబు కానున్నట్లు తెలిసింది. ఈనెలలోనే విష్వక్ సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'తో, సుధీర్‌బాబు 'హరోం హర'తో, రాకేశ్ వర్రె 'జితేందర్ రెడ్డి'తో రాబోతున్నారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న పీరియాడిక్ సినిమాల్లో బాలకృష్ణ చిత్రం ఒకటుంది. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా 80ల నేపథ్యంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతోనే తెరకెక్కుతోంది. ఇక నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ' చారిత్రక కథాంశంతో ముడిపడి ఉన్న సినిమా కాగా.. 'ది ఇండియా హౌస్' స్వాతంత్ర్యానికి పూర్వం సాగే కథతో తెరకెక్కనుంది. శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి రూపొందిస్తున్న స్పోర్ట్స్ డ్రామా కూడా పీరియాడిక్ టచ్ ఉన్న చిత్రమే కావడం విశేషం.



